క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



బైక్ నంబర్ ప్లేట్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పారావు

మల్కాపురం: పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు అర్ధరాత్రి వేళలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహన చోదకులను హెచ్చరించి, జరిమానాలు విధిస్తున్నారు. మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు బుధ, గురువారాల్లో రాత్రి సమయంలో శ్రీహరిపురం, మల్కాపురం, కోరమాండల్ మొదలగు ప్రధాన కూడళ్ల వద్ద గస్తీ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని ఆపి ధ్రువపత్రాలను, నంబర్ ప్లేట్లను పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిబుల్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్‌తో వాహనాల నడిపిన వారిపై కొరడా ఝులిపించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పారావు మాట్లాడుతూ వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించరాదన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిబుల్ డ్రైవింగ్, అతి వేగం, మైనర్ డ్రైవింగ్ తదితర నిబంధనలు పాటించని వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకుని, జరిమానాలు విధిస్తున్నట్టు తెలిపారు.

పోలీసులకు వైద్య సేవలు



మల్కాపురం పీఎస్‌లో పోలీసులకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

మల్కాపురం: విధి నిర్వహణలో ఉండే పోలీస్‌ల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉన్నతాధికారుల ఆదేశాలతో మల్కాపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతి ఒక్క పోలీస్‌కు బీపీ, సుగర్, రక్తహీనత, ఇతర సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో స్టేషన్ పరిధి లా అండ్ ఆర్డర్, క్రైం, ట్రాఫిక్ పోలీసులు పాల్గొని టెస్టులు చేయించుకున్నారు.

వేలాడుతున్న వైర్లు



కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌కు సమీపంలో శివాలయం వైపు వెళ్లే దారిలోని విద్యుత్ స్తంభానికి వైర్లు వేలాడుతున్నాయి. ఆ దారిలో వెళ్లే వారికి తగిలేలా ఉండడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని సమీపంలోని దుకాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి కిందకు వేలాడుతున్న వైర్లను తొలగించాలని కోరుతున్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న జగ్గునాయుడు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని సీఐటీయూ కార్యాలయాల వద్ద గురువారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. మల్కాపురం కార్యాలయం సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.జగ్గునాయుడు యూనియన్ జెండా ఎగురవేసి కార్మికులను అందించిన సేవలపై ప్రస్తవించారు. సిటూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద, 60వ వార్డు గుల్లలపాలెంలో సిటూ ఆవర్భావ దిన వేడుకలు జరిగాయి.

చలివేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి



గోపాలపట్నంలో చలివేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఈ రత్నాకర్ రెడ్డి, ఏఈ వెంకటలక్ష్మి



బీఆర్‌టీఎస్ రోడ్‌లోని చలివేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఈ ప్రసన్నా రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: చలివేంద్రాల నిర్వహణపై జీవీఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జోన్-5 పరిధిలోని వార్డుల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాల పనితీరును ఇంజినీరింగ్ అధికారుల బృందం గురువారం పరిశీలించింది. ఈఈ టి.ప్రసన్నా రెడ్డి, డీఈ ఏడుకొండలు, ఇతర ఇంజినీరింగ్ సిబ్బంది వేర్వేరుగా జోన్ పరిధిలోని అన్ని చలివేంద్రాలను పరిశీలించి, పాదచారులకు, ప్రయాణికులకు అవి ఏ మేరకు ఉపయోగపడుతున్నాయనేది తెలుసుకున్నారు. 'చలివేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం' అనే శీర్షికన ఈ నెల 29న సాక్షిలో ప్రచురితమైన కథనానికి నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ స్పందించారు. ప్రజోపకరమైన వీటి నిర్వహణపై ఎందుకు పర్యవేక్షణ చేయటం లేదని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జోన్-5, 8 పరిధిలో ఎక్కడెక్కడ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటి పనితీరు ఎలా ఉందనేది నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ఇంజినీరింగ్ అధికారులు వేర్వేరు బృందాలుగా ఏర్పడి గురువారం ఆయా జోన్ల పరిధిలో క్షేత్రస్థాయి పర్యటించి చలివేంద్రాల నిర్వహణ తీరును పరిశీలించారు. చలివేంద్రాల వద్ద విధుల్లో ఉన్న వారితో మాట్లాడారు. జోన్-5 పరిధిలోని ఎన్‌ఏడీ సెంటర్, బీఆర్‌టీఎస్ రోడ్‌లో పలు చోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఈఈ ప్రసన్నారెడ్డి పరిశీలించి, అక్కడ ఉన్న సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. ఎన్‌ఏడీ నుంచి మర్రిపాలెం వైపుకు వెళ్లే దారిలో బస్టాప్ దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రంలో విద్యార్థితో మాట్లాడారు. జోన్-8 పరిధిలోని చలి వేంద్రాలను ఈఈ రత్నాకర్, అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్.వెంకటలక్ష్మి విస్తృతంగా పర్యటించి, పరిశీలించారు.

పక్కాగా దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే



సర్వేలో పాల్గొన్న సహిత విద్య కో-ఆర్డినేటర్ గీత, ఎంఈవో రామారావు



అంబేద్కర్ కాలనీలో దివ్యాంగ చిన్నారిని గుర్తించిన ఎంఈవో వెంకటరావు

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు జిల్లాలో చేపడుతున్న సర్వేపై శ్రద్ధ తీసుకోవాలని సహిత విద్య కో-ఆర్డినేటర్ గీత కోరారు. ఐఈఆర్పీలు చేపడుతున్న సర్వేను గురువారం నగరంలో ఆమె పరిశీలించారు. సీతమ్మధార మండలంలోని శ్రీనివాసనగర్ నిర్వహిస్తున్న సర్వేలో ఎంఈవో రామారావుతో కలసి ఆమె పాల్గొన్నారు. భవిత టీచర్లు జగదాంబ, శారద ఇంటింటికీ గుర్తించిన పిల్లలకు పాఠశాలల్లో చర్పించేలా వారికి అక్కడికక్కడే అడ్మిషన్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. సర్వే పక్కాగా చేపట్టాలని సూచించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని వినియోగించుకోవాలంటే తప్పనిసరిగా సర్వేలో నమోదై ఉండాలన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, సర్వేను విజయవంతం చేయాలని ఐఈఆర్పీలకు సూచించారు.

దివ్యాంగ బాలలు బడిలో ఉండాలి

మల్కాపురం: బడి ఈడు దివ్యాంగ చిన్నారులు బడిలో ఉండాలని ఎంఈవో వెంకటరావు అన్నారు. ములగాడ మండలం భవిత కేంద్రంలో నమోదు కాకుండా బడి బయట ఉన్న దివ్యాంగ బాలలను గుర్తించే సర్వే గురువారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మల్కాపురం, అంబేద్కర్ కాలనీలో సర్వే చేసినట్లు తెలిపారు. ఇక్కడ ఓ చిన్నారిని గుర్తించామన్నారు. ఆ చిన్నారిని భవిత కేంద్రంలో చేర్పించాలని తల్లిదండ్రులతో చెప్పామన్నారు. ఇప్పటి వరకు 13 మంది దివ్యాంగ బాలలను గుర్తించినట్లు వివరించారు. జూన్ 9 వరకు ఈ సర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకృష్ణనాయుడు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు స్పందన భేష్

మురళీనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో గురువారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్‌కు అత్యధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. గైస్‌లో 43,001- 51,000, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 51,001-59,000, పెందుర్తిలో 43,001-59,000 ర్యాంకుల విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించగా.. 569 మంది సర్టిఫికెట్లు పరిశీలించారు. గైస్‌లో 239 మంది, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 264 మంది, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 66 మంది కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.

నేటి కౌన్సెలింగ్ వివరాలు..

శుక్రవారం నిర్వహించే సర్టిఫికెట్ల పరిశీలనకు గైస్‌లో 59,001-67,000, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 67,001-75,000, పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీలో 59,001-75,000 ర్యాంకర్లు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోగా హాజరు కావాల్సి ఉంది. ఎస్టీ విద్యార్థులు కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలకు హాజరవ్వాల్సి ఉంటుంది.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం బాబు జగ్జీవన్ నగర్‌లోని లక్ష్మీగణపతి దుర్గాసాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శర్మ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో 2 వేల మందికి అన్నదానం జరిపారు. కార్యక్రమంలో గుమ్మిడి వెంకటరావు, కామేశ్వర్, దుర్గారావు, ఇ.రామకృష్ణ, కె.త్రిమూర్తులు, జి.హనుమంతురావు, డి.ఆదినారాయణ, హరికృష్ణ, అప్పలరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న యాదవ సంఘం జిల్లా కమిటీ ప్రతినిధులు

మల్కాపురం: ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం నుంచి విశాఖ జిల్లాకు కొత్త కమిటీని నియమించారు. 61వ వార్డు మల్కాపురం గొల్లవీధికి చెందిన బొట్ట వెంకటప్పారావు యాదవ్ జిల్లా సెక్రటరీగా, ఉరుకూటి గోపి యాదవ్ ఉపాధ్యక్షుడిగా, నమ్మి శంకర్ యాదవ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులయ్యారు. వీరంతా మల్కాపురం యాదవ వీధిలోని సామాజిక భవనంలో గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా శ్రీనివాస్ యాదవ్ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కొత్త కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లా యాదవ సంఘం ప్రగతికి, సంఘ, కార్యవర్గ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు.

లేపాక్షిలో సరికొత్త చీరలు

- హస్తకళలపై 15 నుంచి 20 శాతం రాయితీ
- ఎంపోరియం మేనేజర్ కార్తీక్ వెల్లడి



జగదాంబ జంక్షన్‌లో గల లేపాక్షి హస్తకళల ఎంపోరియం

డాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్‌లో గల లేపాక్షి హస్తకళల ఎంపోరియంలో సరికొత్త చేనేత, కాటన్, కలంకారీ చీరలు అందుబాటులోకి తెచ్చినట్టు సంస్థ మేనేజర్ ఎ. కార్తీక్ తెలిపారు. ఎంపిక చేసిన మంగళగిరి కాటన్, కొత్త కలర్ షేడ్స్‌లో సిల్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ కలంకారీ, పెన్ పెయింటెడ్ కలంకారీ చీరలు, మరెన్నో చేనేత చీరలు ప్రత్యేకించి మహిళల కోసం అందుబాటులోకి తెచ్చామన్నారు. అలాగే ఎంచుకున్న హస్తకళలపై 15 నుంచి 20 శాతం ప్రత్యేక ప్రమోషనల్ డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. లెదర్, తోలుబొమ్మలు, ల్యాంప్ షేడ్స్, తాటి ఆకు ఉత్పత్తులు, కలంకారీ పెయింటింగ్‌లు, బంజారా బ్యాగులతో పాటు వేసవి కోసం అందుబాటులో ప్రత్యేక హ్యాండ్‌మేడ్, హ్యాండ్లూమ్ చీరలు ప్రదర్శన, విక్రయాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని విశాఖ నగర ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



52వ వార్డులో గ్రీన్‌బెల్ట్ పనులు పరిశీలిస్తున్న ఈఈ ప్రసన్నారెడ్డి

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు గ్రీన్‌బెల్ట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.ప్రసన్నారెడ్డి గురువారం పరిశీలించారు. గ్రీన్‌బెల్ట్ ఆధునికీకరణ పనుల్లో ఎక్కడా రాజీ లేకుండా నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పిల్లలు, పెద్దలు అందరికీ ఉపయోగపడేలా గ్రీన్ బెల్ట్ ఏరియాలో జిమ్, ఆట పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజున సహకరించండి



మాట్లాడుతున్న డీసీపీ-1 లక్ష్మీనారాయణ

సీతమ్మధార: జూన్ 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున ప్రజలంతా పోలీసులకు సహకరించాలని డీసీపీ-1 లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. అక్కయ్యపాలెం షాదీఖానాలో గురువారం స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 144 సీఆర్‌పీసీ సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటాయని తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున ప్రజలు ఎవరూ బయటకు రాకూడదని, నలుగురు కలిసి ఉండరాదని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. జూన్ 4న ఊరేగింపులు, ఉత్సవాలు చేయకూడదన్నారు. రౌడీషీటర్లు రోడ్లపై తిరిగితే కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. సైబర్ క్రైంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ విజయకుమార్, ఎస్‌ఐలు జి.వెంకటరావు, ఎం.సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

52వ వార్డులో అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా పార్కు సమీపంలో బిల్వపత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. పాదచారులు, నిరాశ్రయులకు ఉచితంగా భోజనం అందజేశారు. నగరంలోని వివిధ కూడళ్లలో రోజూ ఇదే మాదిరి అన్నదానం చేస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రవిశంకర్, కుమార్, సూర్య, నూకరాజు, శ్యామ్, సీతారామయ్య, జగదీష్ పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం



59వ వార్డులోని ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న అనధికార నిర్మాణం

మల్కాపురం: విలువైన ప్రభుత్వ స్థలంపై ఓ వ్యక్తి కన్ను పడింది. రెవెన్యూ అధికారులు ఎన్నికల హడావిడిలో ఉండటంతో అక్కడ దర్జాగా అనధికార నిర్మాణం చేపడుతున్నాడు. వివరాలిలా.. 59వ వార్డు జింక్ ఆంజనేయస్వామి ఆలయం ముందు, శ్రీకృష్ణ యాదవ సామాజిక భవనం వెనుక సర్వే నంబర్-55లోని సుమారు 120 గజాల స్థలంలో స్థానిక వ్యక్తి అక్రమ నిర్మాణం చేపడుతున్నాడు. ఎన్నికలకు ముందు ఇక్కడ ఆ వ్యక్తి నిర్మాణం చేపడితే నాడు ములగాడ మండల రెవెన్యూ అధికారులు తొలగించారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు సార్వత్రిక ఎన్నికల హడావిడిలో పడటంతో ఇదే అదునుగా ఆ వ్యక్తి మళ్లీ నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నాడు. సర్వీస్ రోడ్డుకు అతి సమీపాన విలువైన ప్రభుత్వ స్థలంలో అనధికార నిర్మాణం జరుగుతుండటంతో అధికారుల తీరును పలువురు తప్పుపడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఈ విషయంపై ములగాడ మండల రెవెన్యూ కార్యాలయ ఆర్‌ఐ దవళి రమేష్‌నాయుడిని 'సాక్షి' వివరణ కోరగా.. అక్కడ అనధికార నిర్మాణం జరుగుతున్న సంగతి తమ దృష్టిలో ఉందని, దీనిపై గతంలో సదరు వ్యక్తిని హెచ్చరించామని తెలిపారు. మళ్లీ ఆ వ్యక్తి అదే తీరుతో వ్యవహరిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సాయిబాబాకు విశేష పూజలు



పూజలందుకున్న సాయిబాబా



రూ.5 వేల విరాళం అందిస్తున్న దాత

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు బాబాకు విభూది, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు బాబా కీర్తనలను ఆలపించారు. మధ్యాహ్నం మందిరం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సాయిబాబాకు విశేష పూజలు, ఊయాల సేవ నిర్వహించారు. స్థానిక భక్తుడు బాబా మందిర నిర్వహణకు రూ.5 వేలను విరాళంగా అందించాడు.

అంతర్జాతీయ పోటీల్లో విశాఖ సత్తా చాటండి



టీ షర్టులు అందుకున్న మాస్టర్ అథ్లెట్స్

మురళీనగర్: అయోధ్యలో నిర్వహించనున్న అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించిన విశాఖ అథ్లెట్స్ తమ సత్తా చాటి విజేతలుగా తిరిగి రావాలని ఇండియా మాస్టర్ అథ్లెట్స్ సెక్రటరీ జనరల్ మంగ వరప్రసాద్ ఆకాంక్షించారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన మాస్టర్ అథ్లెట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ముంబైలో జరిగిన 43వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024లో ఆంధ్రప్రదేశ్ తరఫున విశాఖ నుంచి వెళ్లి స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించిన అథ్లెట్స్‌కు అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి అవసరమైన సూచనలిచ్చారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన విశాఖ అథ్లెట్స్ దువ్వూరి సరోజినీ, టి.సుధాకర్, అమిత్ లక్ష్మణరావు పాటిల్, కె.బి.వై.ఎం.కృష్ణప్రసాద్, టి.డి.శశికుమార్, శ్రీరామకృష్ణ, జితేంద్రకుమార్‌లకు టీ-షర్టులు అందజేశారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్స్ పార్క్ కార్యదర్శి పి.ఎస్.ఎన్.రాజు, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సిహెచ్.శ్రీనివాసరాజు, విశాఖ వెటరన్ అథ్లెట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు పాల్గొన్నారు.

పర్యావరణ మార్పులపై సెప్టెంబర్‌లో సదస్సు



సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సముద్ర అధ్యయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ×వాతావరణ మార్పు అధ్యయనాలకు సంబంధించి వాతావరణ సముద్ర ప్రక్రియల్లో ప్రస్తుత పోకడలు అంశంపై జాతీయ సదస్సును సెప్టెంబర్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సముద్ర అధ్యయన శాస్త్ర విభాగం సెప్టెంబర్‌లో ప్లాటినం జూబ్లీ వేడుకలను జరుపుకోనుంది. దీనిలో భాగంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య పి.సునీత, బీవోఎస్ చైర్మన్ ఆచార్య సి.వి.నాయుడు, ఆచార్య ఒ.ఎస్.ఆర్.భానుకుమార్, ఆచార్య విఠల్ మూర్తి, డాక్టర్ ఆర్.ఆర్.రావు, డాక్టర్ సి.వి.కె.ప్రసాదరావు, డాక్టర్ వి.ఎస్.ఎన్.మూర్తి, డాక్టర్ కె.సోమసుందర్ పాల్గొన్నారు.

యువ పారిశ్రామికవేత్తలకు అవకాశాలు మెండు



యూబీఐ జోనల్ హెడ్ శాలిని మీనన్‌కు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు



సదస్సులో పాల్గొన్న యువ పారిశ్రామిక వేత్తలు, అధికారులు

ఏయూ క్యాంపస్: స్వశక్తితో ఎదిగే యువ పారిశ్రామికవేత్తలకు అనేక అవకాశాలు ఉంటున్నాయని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ శాలిని మీనన్ అన్నారు. గురువారం ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో రోటరీ క్లబ్ విశాఖపట్నం 3020, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్, యూబీఐ సంయుక్తంగా యువ పారిశ్రామికవేత్తల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార రంగంలో రాణించాలని ఆకాంక్షించే వారికి అనేక వేదికలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఎంఈఎంఎస్‌ల ద్వారా రుణాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రోటరీ క్లబ్ విశాఖ అధ్యక్షుడు ఆర్.టి.ఎన్.డి.మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు కల్పించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ లీలారాణి, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రమౌళి, ఎస్‌ఆర్‌డీసీ రీజినల్ మేనేజర్ బి.కె.సాహు, ఉపేంద్ర శ్రీనివాస్, రోటరీ క్లబ్ విశాఖపట్నం కార్యదర్శి పి.వి.రఘుపతి, పెద్ద సంఖ్యలో యువ పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.